రెండు నెలల్లో టెస్లా విక్రయాలు!

- గరిష్ఠ ధర రూ.2 కోట్లకు పైమాటే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: అమెరికాకు చెందిన ఈవీల సంస్థ టెస్లా భారత్‌లో అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నది. వచ్చే రెండు నెలల్లో తన తొలి షోరూంను ముంబైలో లేదా నూఢిల్లీలో ప్రారంభించబోతున్నట్లు తెలుస్తున్నది. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌తోపాటు న్యూఢిల్లీలోని ఏరోసిటీలో అవుట్‌లెట్‌ను తెరిచేయోచనలో సంస్థ ఉన్నది. 2022లో భారత్‌లో అడుగుపెట్టాలని చూసిన సంస్థ..భారత ప్రభుత్వం విధిస్తున్న సుంకాలపై బహిరంగంగానే విమర్శలు గుప్పించి వెనక్కితగ్గింది. మళ్లీ ఇప్పుడు ఇక్కడి మార్కెట్లో అడుగు పెట్టడానికి రెడీ అయింది. కంపెనీ ఎన్ని మాడళ్లు, ధర ఎంత అనేదానిపై స్పష్టం చేయకపోయినప్పటికీ.. అమెరికాలో ఆయా మాడళ్ల ధర ఆధారంగా ఇక్కడి ధరలను నిర్ణయించే అవకాశం ఉన్నది. ప్రారంభ ధర రూ.21 లక్షలు(25 వేల డాలర్లు) స్థాయిలో ఉంటుందని అంచనా. దీంతోపాటు టెస్లా సైబర్‌ట్రక్ రూ.50.70 లక్షలు, మాడల్ 2 రూ.45 లక్షలు, మాడల్ 3 రూ.60 లక్షలు, మాడల్ వై రూ.70 లక్షలు, మాడల్ ఎస్ రూ.1.50 కోట్లు, మాడల్ ఎక్స్ రూ.2 కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనా.

తీవ్ర ఊగిసలాటలో సూచీలు



ముంబై, ఫిబ్రవరి 19: దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. బ్లూచిప్ సంస్థల షేర్లు భారీగా నష్టపోవడంతో ఒక దశలో 700 పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్ చివర్లో ఈ భారీ నష్టాలను తగ్గించుకోగలిగింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలే ఇందుకు కారణం. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 28.21 పాయింట్లు నష్టపోయి 75,939.18 వద్దకు చేరుకోగా, నిఫ్టీ 12.40 పాయింట్లు కోల్పోయి 22,932.90 వద్ద ముగిసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లను విధించనున్నట్లు మరోసారి స్పష్టంచేయడంతో దేశీయ ఐటీ షేర్లు కుప్పకూలాయి. ముఖ్యంగా టీసీఎస్, ఇన్ఫోసిస్ షేరు 2 శాతానికి పైగా నష్టపోయింది. దీంతోపాటు హెచ్‌యూఎల్, భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. కానీ, జొమాటో షేరు 5 శాతం వరకు లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. అలాగే ఎల్‌అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే ఐటీ 1.33 శాతం, టెక్నాలజీ 1.31 శాతం పతనం చెందగా..ఇండస్ట్రియల్స్ 2.59 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.19 శాతం, మెటల్ 1.41 శాతం, సర్వీసెస్ 1.41 శాతం, కమోడిటీస్ సూచీలు లాభపడ్డాయి.

సైయెంట్ సీఈవోగా సుకమల్ బెనర్జీ

హైదరాబాద్, ఫిబ్రవరి 19: హైదరాబాద్ కేంద్రస్థానంగా ఐటీ కార్యకలాపాలు అందిస్తున్న సైయెంట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా సుకమల్ బెనర్జీ నియమితులయ్యారు. ఈ నియామకం బుధవారం నుంచి అమలులోకి వచ్చినట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఐదేండ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. మెకానికల్ ఇంజినీరింగ్, ఎంబీఏ ఫైనాన్స్ చేసిన ఆయనకు టెక్నాలజీ విభాగంలో మంచి పట్టున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.1,926.4 కోట్ల ఆదాయంపై రూ.122.3 కోట్ల నికర లాభాన్ని గడించింది.

బీమా-ఏఎస్‌బీఏ

ప్రీమియం చెల్లింపుల కోసం పాలసీదారులకు సరికొత్త సదుపాయం

పరిచయం చేసిన ఐఆర్డీఏఐ-వచ్చే నెల 1 నుంచి అందుబాటులోకి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్డీఏఐ.. పాలసీదారుల కోసం బీమా-ఏఎస్‌బీఏ (అప్లికేషన్స్ సపోర్టెడ్ బై బ్లాక్డ్ అమౌంట్) పేరిట ఓ సరికొత్త ప్రీమియంల చెల్లింపు విధానాన్ని పరిచయం చేసింది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా ప్రీమియం చెల్లింపు కోసం పాలసీదారులు తమ బ్యాంక్ ఖాతాల్లో సరిపడా నిధులను నిలుపుదల చేయడానికి ఇది దోహదపడుతుందని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్డీఏఐ) తెలిపింది. జీవిత, ఆరోగ్య బీమా కోసం ప్రీమియం చెల్లింపుల ప్రక్రియను సులభతరం చేయడమే దీని ఉద్దేశమని పేర్కొన్నది. కాగా, మార్చి 1 నుంచి బీమా-ఏఎస్‌బీఏ సౌకర్యం అందుబాటులోకి రానున్నది. దీన్ని అమలు చేయాలని బీమా సంస్థలకు ఐఆర్డీఏఐ తాజాగా స్పష్టం చేసింది. నిజానికి ఏఎస్‌బీఏ లేదా యూపీఐ ద్వారా ఖాతాల్లో నగదు నిలుపుదల సదుపాయాన్ని స్టాక్ మార్కెట్లలో రిటైల్ ఇన్వెస్టర్లు ఎప్పట్నుంచో విరివిగా వాడుతున్నారు.

ఇదీ సంగతి..

జీవిత బీమా లేదా ఆరోగ్య బీమా తీసుకోవాలనుకునేవారికి పాలసీ ఆమోద సమయంలో నగదు సమస్య రాకుండా, ప్రీమియం చెల్లింపులు ఆగిపోకుండా ఉండేందుకు ఈ బీమా-ఏఎస్‌బీఏ సౌకర్యం కలిసిరానున్నది. మనలో చాలామంది బీమా పాలసీలను కొనాలని నిర్ణయించుకొని, ఆ ప్రక్రియ మొదలుపెట్టాక.. మధ్యలో నగదు లేక వెనకడుగు వేస్తూంటారు. ఇలాంటివారు బీమా-ఏఎస్‌బీఏను ఎంచుకొంటే తప్పక బీమా రక్షణను పొందగలరని ఐఆర్డీఏఐ ఆశిస్తున్నది. దేశ ప్రజలందరికీ బీమా రక్షణ లభించాలన్న లక్ష్యంలో భాగంగానే దీన్ని తెచ్చారు. ఇక పాలసీదారుల బ్యాంక్ ఖాతాలో ఒకసారి బీమా ప్రీమియంకు సంబంధించిన నగదు ఆగితే.. పాలసీ జారీ అయ్యాకే సదరు బీమా సంస్థకు ఆ సొమ్ము బదిలీ అవుతుంది. కాబట్టి పాలసీదారుల నగదుకు పూర్తి భద్రత ఉన్నట్టే. యూపీఐ ద్వారా వన్-టైమ్ మ్యాండేట్ (ఓటీఎం) సహాయంతో తమ బ్యాంక్ ఖాతాల్లో కస్టమర్లు నిర్దిష్ట నగదును నిలుపుదల చేయవచ్చు. ఒకవేళ బీమా పాలసీ ప్రతిపాదన తిరస్కరణకు గురైతే ఈ నగదు తిరిగి ఖాతాదారునికి అందుబాటులోకి రాగలదు. అయితే అప్పటిదాకా ఆ సొమ్మును ఖాతాదారులు కూడా వాడుకోలేరు.

ఎలా పనిచేస్తుంది?

- *బీమా కోసం దరఖాస్తు చేసుకొనే వ్యక్తిగత పాలసీదారులు ఫారంలో బీమా-ఏఎస్‌బీఏ సదుపాయాన్ని ఎంచుకోవాలి.*
- *బీమా సంస్థ తమ భాగస్వామి బ్యాంక్ ద్వారా బీమా ప్రీమియం సొమ్మును ఖాతాలోనే నిలుపుదల చేయాలని పాలసీదారుని బ్యాంక్‌కు విజ్ఞప్తి చేస్తుంది.*
- *పాలసీదారుని అంగీకారంతో బీమా ప్రీమియం చెల్లింపునకు సరిపడా నగదును ఖాతాలోనే బ్యాంక్ ఆపేస్తుంది. ఈ సమాచారాన్ని బీమా సంస్థకూ బ్యాంక్ తెలియజేస్తుంది.*
- *ఖాతాలో నిలిచిపోయిన నగదుకు వడ్డీ ఆదాయం కూడా ఉంటుంది. కానీ బీమా సంస్థ తుది నిర్ణయం వచ్చేదాకా దాన్ని కస్టమర్లు తీసుకోలేరు.*
- *కస్టమర్ పాలసీని బీమా సంస్థ ఆమోదిస్తే.. అప్పుడు సదరు కంపెనీ విజ్ఞప్తి మేరకు ఖాతా నుంచి ప్రీమియం సొమ్మును బ్యాంక్ బదిలీ చేస్తుంది.*
- *బీమా పాలసీ తిరస్కరణకు గురైతే ఖాతాలో నిలిపిన నగదు మొత్తాలు పూర్తిగా ఖాతాదారునికి అందుబాటులోకి వస్తాయి.*
- *14 రోజుల్లోగా బీమా దరఖాస్తు ప్రక్రియ పూర్తికాకపోతే బ్యాంకులు ఖాతాలోని సొమ్మును అన్‌బ్లాక్ చేసేస్తాయి. అప్పుడు ఖాతాదారుడు దాన్ని తన ఇతర అవసరాలకు వాడుకోవచ్చు.*

దేశీయ ఫార్మాకు కష్టకాలం!

ట్రంప్ 25 శాతం సుంకం విధించనుండటంతో ఎగుమతులపై ప్రభావం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: దేశీయ ఫార్మా రంగానికి కష్టకాలం మొదలైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం ఫార్మా సంస్థలపై పిడుగుపడినట్లు అయింది. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే సెమికండక్టర్లు, ఫార్మాస్యూటికల్ ఉత్పత్తులపై 25 శాతం లేదా అంతకంటే ఎక్కువగా పన్ను వేయనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అమెరికా జనరిక్ ఔషధ మార్కెట్‌పై ఆధారపడివున్న దేశీయ ఫార్మా సంస్థలకు ఇది చేదువార్త. 2024లో భారత్ నుంచి అమెరికాకు 8.7 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలు ఎగుమతి అయ్యాయి. మొత్తం ఎగుమతుల్లో వీటి వాటా 31 శాతంగా ఉన్నది. ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో అక్కడి మార్కెట్లో విక్రయించనున్న జనరిక్ ఔషధ ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉన్నది. దీంతో అమెరికన్లు దేశీయ జనరిక్ ఔషధాల కొనుగోలు తగ్గించి, అక్కడి ఉత్పత్తులను కొనుగోలు చేసే అవకాశాలుంటాయని మార్కెట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. యూఎస్‌లో వినియోగిస్తున్న జనరిక్ ఔషధాల్లో సగం భారత్ నుంచి దిగుమతి చేసుకుంటున్నవే కావడం విశేషం. దీంతో ఏటా అమెరికా 408 బిలియన్ డాలర్ల ఆదా అవుతున్నది.

కంపెనీలపై ప్రతికూల ప్రభావం..

టారిఫ్‌ల దెబ్బతో సన్‌ఫార్మాస్యూటికల్స్, డాక్టర్ రెడ్డీస్, సిప్లా, బయోకాన్ వంటి సంస్థలు భారీగా నష్టపోనున్నాయి. 2024లో సన్‌ఫార్మాకు వచ్చిన మొత్తం ఆదాయంలో అమెరికా నుంచి 32 శాతం సమకూరింది. ఈ టారిఫ్‌లపై కంపెనీ ఎండీ దిలీప్ సంఘ్వీ మాట్లాడుతూ..అదనపు సుంకాలు విధించడంతో సంస్థపై పడనున్న భారాన్ని వినియోగదారులపై మోపనున్నట్లు చెప్పారు. ఫార్మా ఉత్పత్తుల ధరలు పెంచకతప్పదని ఆయన సంకేతాలిచ్చారు. ట్రంప్ టారిఫ్‌ల దెబ్బ ఫార్మా సంస్థలతోపాటు కొనుగోలుదారులపై కూడా పడనున్నదన్నమాట. 100 దేశాలకు తన ఔషధాలను ఎగుమతి చేస్తున్న సంస్థకు వచ్చే మొత్తం ఆదాయంలో వీటి వాటా 72.7 శాతంగా ఉండటం విశేషం. అలాగే డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌కు వచ్చిన ఆదాయంలో 47 శాతం ఉత్తర అమెరికా నుంచి సమకూరుతున్నది. వీటిలో ఆంకాలజీ, ఇమ్యునాలజీ థెరపీకి సంబంధించిన జనరిక్ ఔషధాలు అత్యధికంగా అమ్ముడవుతున్నాయి. దేశంలో మూడో అతిపెద్ద ఔషధ సంస్థ సిప్లా ఆదాయంలో 30 శాతం ఉత్తర అమెరికా నుంచి సమకూరుతున్నది.

బుధవారం హైదరాబాద్‌లోని కాస్మోస్ సహకార బ్యాంక్ ఎంజీ రోడ్ శాఖ 18వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బ్యాంక్ జనరల్ మేనేజర్ ఉమేష్ బెల్జే, డీజీఎం జితేంద్ర అంబార్కర్, ఏజీఎం ఏ సందీప, చీఫ్ మేనేజర్లు వీ గౌతమ్ రాయ్, సీ రమేశ్, బ్రాంచ్ మేనేజర్ వీ సంధ్యా కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ ఆల్‌టైమ్ హైకి బంగారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: దేశీయంగా బంగారం ధరలు మళ్లీ ఆల్‌టైమ్ హైకి చేరుకున్నాయి. బుధవారం ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి విలువ రూ.900 పుంజుకొని రూ.89,400లుగా నమోదైంది. తొలిసారి గత శుక్రవారం (ఫిబ్రవరి 14) ఇదే స్థాయికి ధరలు పెరిగిన విషయం తెలిసిందే. అయితే సోమవారం ఒక్కరోజే ఏకంగా రూ.1,200 పడిపోయింది. కానీ మంగళవారం రూ.300 పెరిగిన నేపథ్యంలో మళ్లీ రేటు రికార్డు గరిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడికి పెరిగిన డిమాండ్, భారతీయ విపణిలో హోల్‌సేల్, రిటైల్ నగల వ్యాపారుల కొనుగోళ్లు ధరల్ని పరుగులు పెట్టించాయని అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. కాగా, ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా తులం బంగారం ధర దేశీయ మార్కెట్‌లో రూ.10,010 పెరిగింది. జనవరి 1న రూ.79,390గా ఉన్నది. ఇదిలావుంటే హైదరాబాద్‌లో తులం 24 క్యారెట్ పుత్తడి రేటు రూ.700 ఎగబాకి రూ.87,650గా.. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) 10 గ్రాములు రూ.650 ఎగిసి రూ.80,350గా ఉన్నది.

మొక్కు తీర్చేందుకు.. శ్రీశైలానికి మోకాళ్ల యాత్ర

శ్రీశైలానికి మోకాళ్ల యాత్ర చేపట్టిన శివస్వామి బాలనాగయ్య

దోమలపెంట, ఫిబ్రవరి 19 : శివయ్యకు మొక్కు తీర్చేందుకు ఓ భక్తుడు శ్రీశైలం వరకు సాహసోపేతమైన మోకాళ్ల యాత్ర చేపట్టాడు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం మారేపల్లికి చెందిన 62ఏండ్ల కుర్వ బాలనాగయ్య 2008 ఏడాదిలో తన సొంతూరు నుంచి మోకాళ్లపై శ్రీశైల క్షేత్రానికి చేరుకోవాలని మొక్కాడు. ఈ క్రమంలో గ్రామం నుంచి అచ్చంపేట మండలం రంగాపూర్ వరకు 60 కిలోమీటర్లు యాత్ర గతంలోనే చేపట్టి అనారోగ్యానికి గురవడంతో వైద్యుల సలహా మేరకు యాత్ర విరమించాడు. తిరిగి 16ఏండ్ల తర్వాత మొక్కు చెల్లించేందుకు సిద్ధమయ్యాడు. 15రోజుల కిందట రంగాపూర్‌లో శివమాలధారణలో ఆయన యాత్ర ప్రారంభమవగా.. బుధవారం 70 కిలోమీటర్లు కొనసాగి అమ్రాబాద్ మండలం దోమలపెంటకు చేరింది. మోకాళ్లకు తీవ్ర గాయమైనా యాత్ర కొనసాగిస్తున్నాడు. మరో రెండ్రోజుల్లో మరో 30 కిలోమీటర్లు యాత్ర చేపట్టి శ్రీశైలానికి చేరుకుంటానని బాలనాగయ్య తెలిపాడు. శివయ్య కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా యాత్ర కొనసాగిస్తానని చెప్పారు. ఆయన వెంట గురుస్వామి రామకృష్ణ, మహేశ్, మల్లయ్య ఉన్నారు.

పంచవటిలో ఘనంగా వార్షికోత్సవం

విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, కళాశాల కరస్పాండెంట్, చైర్మన్, ప్రిన్సిపాల్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 19 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పంచవటి విద్యాలయంలో బుధవారం 21వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పంచవటి విద్యాలయంలో విద్యాభ్యాసం చేసిన వారిలో 60శాతం మంది పూర్వ విద్యార్థులు అబ్రార్డ్‌లో స్థిర నివాసం ఏర్పర్చుకున్నారని, ఇది పాలమూరుకు గర్వకారణమన్నారు. అంతకు ముందు విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గోదారి గట్టుమీద రామచిలకావే..! అంటూ చేసిన సినిమా పాట అందర్నీ ఉర్రూతలూగించింది.

మహబూబ్‌నగర్ విద్యానిధికి రూ.5లక్షలు విరాళం..

మహబూబ్‌నగర్ విద్యానిధికి పంచవటి విద్యాలయం తరపున రూ.5లక్షలు చెక్కును పంచవటి విద్యాలయ కరస్పాండెంట్ అనితారెడ్డి, చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. పోటీ పరీక్షలు, టాలెంట్ టెస్టులు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేత లుగా నిలిచిన విద్యార్థులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్య క్రమంలో పంచవటి విద్యాలయం ప్రిన్సిపాల్ వెంకటరమణ, శ్రీకాంత్, రాం భూపాల్‌రెడ్డి బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కస్తూర్బా, గురుకులంలో ఆర్‌జేడీ తనిఖీ

బాలానగర్ (రాజాపూర్), ఫిబ్రవరి 19 : రాజాపూర్ మండలంలోని కస్తూర్బా, గురుకులాన్ని బుధవారం ఆర్జేడీ విజయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలోని విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నారనే కొందరు తల్లిదండ్రుల ఆరోపణల నేపథ్యంలో తనిఖీలు చేసిన ట్లు ఆర్జేడీ తెలిపారు. ఇకపై ఇలాంటి ఆరోపణలు వినిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌వో పావని, ఉపాధ్యాయులకు సూచించారు.

దివ్యాంగురాలికి తప్పని తిప్పలు

- రోడ్డుదాటాలంటే మురుగునీటిలో ప్రయాణించాల్సిందే..
- ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటైతేనే సమస్యకు పరిష్కారం

అయిజ, ఫిబ్రవరి 19 : దివ్యాంగురాలికి మురుగునీటి కష్టాలు తప్పడంలేదు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో రోడ్డుకు ఇటువైపుగా ఉన్న దివ్యాంగురాలు చిన్నపాటి కిరాణ దుకాణానికి వెళ్లాలంటే మురుగునీటిలో ప్రయాణించాల్సిందే. మండలంలోని మేడికొండ గ్రామంలోని ప్రధాన రహదారి అయిజ-ఎమ్మిగనూర్ రహదారిలో నివాసం ఉంటున్న దివ్యాంగురాలు సంతోషమ్మ చిన్నపాటికి దుకాణం నిర్వహించుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. సంతోషమ్మ పుట్టుకతోనే పోలియో కారణంగా రెండు కాళ్లు పనిచేయవు. ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా కిరాణ దుకాణం ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తుంది. గ్రామంలోని ప్రధాన రహదారిలో ఒక వైపునే డ్రైనేజీ ఉండటంతో ఇంటి ముందు రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు అధికమై రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో ఒక వైపున నివాసం ఉంటున్న దివ్యాంగురాలు మరో వైపున ఉన్న కిరాణ దుకాణానికి వెళ్లాంటే నిత్యం నరకం అనుభవిస్తూ మురుగునీటిని దాటాల్సి వస్తోంది. నిత్యం ఆర్టీసీ బస్సులతోపాటు వివిధ రకాల వాహనాలు, గ్రామ ప్రజలు మురుగునీటిలో నడుస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటు చేయాలని గతంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి గుండా ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటు చేస్తే మురుగునీటికి పారుదల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మేడికొండలో మురుగునీటిని దాటుతున్న దివ్యాంగురాలు సంతోషమ్మ

దవాఖానలో బాలింతతో మాట్లాడుతున్న కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారి కర్ణన్

మందుల కొరత లేకుండా చూడాలి

- కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారి కర్ణన్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 12 : మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ దవాఖాల్లో మందుల కొరత లేకుండా రోగులకు అందించాలని కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. బుధవారం ఆయన మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని మందులు అందుబాటులో ఉంచాలని సెంట్రల్ డ్రగ్ అధికారులకు సూచించారు. జిల్లాలో మందుల కొరత ఉందని ఆయా పత్రికల్లో వార్త కథనాలు రావడంతో పరిశీలించినట్లు తెలిసింది. రోగులు ప్రైవేట్ దవాఖానలకు ఆశ్రయించకుండా చర్యలు తీసుకోవాలని జనరల్ దవాఖాన వైద్య అధికారులకు ఆదేశించారు. అనంతరం మతాశిశు కేంద్రానికి వెళ్లి రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. క్యూలో నిలబడిని గర్భిణులు ఓపీ కోసం నిలబడగా, వారిని గమనించి ఆయన వారితో మాట్లాడారు. గంటల తరబడి ఓపీ కోసం నిలబడాల్సిన అవసరం లేదని, నేరుగా డాక్టర్ వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో కృష్ణ, డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్, ఆర్ఎంవో జరీనా, డీఐవో పద్మజ, పీవో భాస్కర్‌నాయక్, డీఈఐసీ మేనేజర్ దేవిదాస్‌నాయక్, సుభాష్ చంద్రబోస్ తదితరులు ఉన్నారు.

వైద్య పరీక్షలు వచ్చిన గర్భిణితో మాట్లాడుతున్న ఎన్‌హెచ్‌ఎం ఆర్. వి. కర్ణన్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వడ్డేపల్లి, ఫిబ్రవరి 19 : మండలంలోని జూలేకల్ శివారులో రోడ్డు ప్ర మాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై నాగశేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... అయిజ పట్టణానికి చెందిన చాకలి మద్దిలేటి (52) శాంతి నగర్‌కు బుధవారం సాయంత్రం తన ద్విచక్రవాహనంలో పనిమీద వచ్చి తిరిగి వె ళ్తుండగా నిలిచి వున్న ట్రాక్టర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. బాధితులు కేసు పెట్టలేదని పూర్తివివరాలు తెలియాల్సి ఉందన్నారు.

కోదండాపూర్ ఎస్సైగా మురళీ బాధ్యతలు స్వీకరణ

ఎర్రవల్లి చౌరస్తా, ఫిబ్రవరి 19 : మండలంలోని కోదండాపూర్ ఎస్సైగా మురళీ బుధవారం రోజు బాధ్యతలు తీసుకున్నారు. గతంలో మురళీ నారాయణపేట్ హెడ్ క్వాటర్స్ మరికల్‌లో విధులు నిర్వహించారు. అనంతరం కోదండాపూర్ పీఎస్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

ఆకట్టుకున్న సందెరాళ్లు ఎత్తు పోటీలు

దొబ్బుడు గుండు ఎత్తిన కర్ణ

సందెరాయి ఎత్తిన బలభీముడు

అయిజ, ఫిబ్రవరి 19 : పట్టణంలోని బుధవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర సందెరాళ్లు, దొబ్బుడు గుండ్లు ఎత్తుపోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. పోటీలకు తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన బలభీములు తరలొచ్చారు. గెలుపొందారు. సందెరాళ్లు ఎత్తు పోటీలో 10 మంది బలభీములు పాల్గొనగా 105 కేజీల విభాగంలో మేడికొండకు చెందిన రాజు మొదటి బహుమతి, హిందువాసికి చెందిన నాగరాజు రెండో బహుమతి, తప్పెట్లమొర్సుకు చెందిన కృష్ణ మూడో బహుమతి గెలుచుకున్నారు. దొబ్బుడు గుండు పోటీలో 160 కేజీల విభాగంలో రాయచూర్ జిల్లా, కప్పగల్‌కు చెందిన కర్ణ మొదటి బహుమతి, అయిజ మండలం, వెంకటాపూర్‌కు చెందిన లాల్‌భాషా రెండో బహుమతి కైవసం చేసుకున్నారు. గెలుపొందిన విజేతలకు ఆలయ కమిటీ సభ్యులు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కారు బైక్ ఢీ : ఇద్దరి మృతి

శేఖర్ (ఫైల్)

శ్రీను (ఫైల్)

తాడూరు, ఫిబ్రవరి 19 : కల్వకుర్తి -నంద్యాల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన చోటు చేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం.. తాడూరు మండలం గుంతకోడూరు గ్రామ సమీపంలో బుధవారం తెల కపల్లి మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన శ్రీను(42) అదే గ్రామానికి చెందిన శేఖర్(30)బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా తెలకపల్లి మండలం కార్వంగ గ్రామానికి చెందిన రవికుమార్ కారులో కల్వకుర్తి నుంచి నాగర్‌కర్నూల్ వైపు వస్తుండగా బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈ ప్ర మాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు కింద పడడంతో వారిపై నుంచి కారు వెళ్లి పక్కనే ఉన్న మొక్కజొన్న పంటలోకి దూసుకెళ్లింది. గమనించిన చుట్టుపక్కల రైతులు క్షతగాత్రులు ఇద్దరిని అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మార్గమధ్యలోనే శ్రీను మృతి చెందగా శేఖర్‌ను నాగర్‌కర్నూల్ నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు సమాచారం. అయితే శ్రీను హైదరాబాద్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తూ మంగళవారం స్వగ్రామమైన అనంత సాగర్‌కు వచ్చాడు. పని పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌కు వెళ్తుండగా నేను వస్తానంటూ శేఖర్, శ్రీను వెంట బయలుదేరాడు. హైదరాబా